అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్, విక్రమ్‌కుమార్

అబిడ్స్: పౌర సరఫరాల శాఖలో గతంలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2021లో కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడ్డారని వివరించారు. వారి వివరాలు కూడా అందజేస్తే నేటి వరకూ చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ చౌహాన్ నగర చీఫ్ రేషన్ అధికారికి ఫోన్ చేసి వెంటనే ఆయా అవినీతి అధికారుల వివరాలు తెలపాలన్నారు. విచారణ జరిపి వెంటనే తనకు రిపోర్టు ఇవ్వాలని వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని చౌహాన్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విచ్ఛిన్నకర శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి


వేడుకల్లో పాల్గొన్న ఐవైఆర్ కృష్ణారావు తదితరులు

నాంపల్లి: దేశాన్ని విచ్ఛిన్నకర శక్తుల నుంచి కాపాడుకునేందుకు జాతీయవాదులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు కోరారు. సమాచార భారతి ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో నారద జయంతి వేడుకలు, ప్రపంచ పాత్రికేయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయ రంగంలో విశేషమైన సేవలందిస్తున్న వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారావు మాట్లాడుతూ వ్యవస్థలు దిగజారుతున్నాయని చెప్పారు. జర్నలిజం పోకడలు మారిపోతున్నాయని, కాలంతో పాటు విధానాలు, విలువలు మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో మంచి–చెడులు ఉన్నాయని, ఫేక్ న్యూస్ వేగంగా వ్యాప్తి చెందుతోందన్నారు. ఈ కాలంలో నారదుడు ఉంటే కూడా మనుగడ సాగించలేకపోయేవారని చమత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన సమాచార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... జాతీయవాద భావాలను పెంపొందించి, జాతీయవాద శక్తులను బలోపేతం చేసేందుకు సమాచార భారతి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్, భాగ్యనగర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సీనియర్ సంపాదకులు వైఎస్ఆర్ శర్మ, సీనియర్ పాత్రికేయులు గుళ్లమూడి శ్రీనివాసకుమార్, సీనియర్ కాలమిస్ట్ చిరువోలు పార్థసారథి, సీనియర్ ఫొటో జర్నలిస్టు కె.దుర్గా నర్సింహరావు, సీనియర్ పాత్రికేయురాలు పొన్నపల్లి నాగమణి, సీనియర్ పాత్రికేయులు జి.మహేష్‌రెడ్డిలు పురస్కారాలు అందుకున్నారు.

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన


భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గౌలిపురా: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం గౌలిపురా మార్కెట్‌లో పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తా హైకోర్టు ముస్లిం ఉప కులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేయడం తీర్పును స్వాగతిస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వం కోర్టు తీర్పును ధిక్కరించి ఈ తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు వెళ్లడాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా భాగ్యనగర్ జిల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఎడ్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు చంద్రశేఖర్, మోకాళ్ల వెంకటేశ్, కందడి ప్రేమ్‌రాజ్, రూప్‌రాజ్, మహేశ్, నిరంజన్ యాదవ్, ధీరజ్, వెంకటేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ


గ్రంథాలను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తాళ్లపాక అను సాహిత్యానికి గరికపాటి వెంకట్ చేస్తున్న సేవలు అద్వితీయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరికపాటి వెంకట్ అన్నమయ్య సంకీర్తనలపై రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఒక పుస్తకం రాయడమే ఘనం అనే భావించే ఈ రోజుల్లో 22 పుస్తకాలు రచించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. అంతకు ముందు కె.రామాచారి శిష్యబృందం ఆలపించిన గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక సంచాలకు మామిడి హరికృష్ణ, స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాష్ చంద్ర బరోడ్, సాహితీవేత్త సుధామ, శ్రీ సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధితులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని వెంటనే చెల్లించండి

అబిడ్స్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధితులకు ఉపశమనం పునరావసం వెంటనే కల్పించాలని హైదరాబాద్ జిల్లా విజిలెన్స్ కమిటీ మానిటరీ వింగ్ సభ్యులు బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్ మాదిగ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ యాదయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్ మాదిగ మాట్లాడుతూ.. 2349 బాధితుల కోసం పునారావసం రావాలిస ఉండగా ఇంత వరకు రావడం లేదన్నారు. హైదరాబాద్ నగరంలో రావాల్సిన వారికి వెంటనే విడుదల చేయాలన్నారు. బాధితులకు డబ్బులు విడుదల చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న రాంప్రసాద్, ఎల్లేష్ మాదిగ

ప్రశాంతంగా పాలిసెట్ 2024


హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్.రాజేశ్వరీ దేవి

విజయనగర్‌కాలనీ: పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ఎంట్రన్స్–2024 పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. అధికారులు ఎన్ని జాగ్రత్తలు చెప్పినా పలు సెంటర్లకు నిమిషం నిబంధన తర్వాత వచ్చిన విద్యార్థులను అనుమతించకపోవడంతో నిట్టూరుస్తూ వెనుదిరిగారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరీక్ష సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు తమను అనుమతించాలని అధికారులను బతిమాలడం కనిపించింది. ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగింది. తమ పరిధిలోని 11 కేంద్రాల్లో మొత్తం 3772 విద్యార్థులకు గాను 3203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సెంటర్ కో ఆర్డినేటర్ ఎస్.రాజేశ్వరీ దేవి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. అల్లా మసీద్, అసద్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే హుడా కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి 3 గంటల వరకు, పాండు రంగానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలతో పాటు అస్రా ఆసుపత్రి విద్యుత్ ఫీడర్ పరిదిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సైఫాబాద్ డివిజన్ పరిధిలో..

అబిడ్స్: చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా సైఫాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ సీబీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బషీర్‌బాగ్ కమీషనర్ ఆఫీస్ పరిధిలోని ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్ రోడ్డు, అపోలో ఆసుపత్రి రోడ్డు ఫెర్నండేజ్ ఆసుపత్రి రోడ్డు, మాలిక్ చాంబర్స్ రోడ్డు, హైనీర్ చాంబర్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు అవంతినగర్ ఫీడర్ పరిధిలోని బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ ఏరియా, స్కైలైన్ అపార్ట్‌మెంట్ ఏరియా, అవంతినగర్, తిరుమల అపార్టుమెంటు ప్రాంతాలు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 వరకు గన్‌ఫౌండ్రీ రోజరీ కాన్వెన్స్ ప్రాంతాలు, సూర్యలోగ్ కాంప్లెక్స్ ప్రాంతాలు, అగర్వాల్ చాంబర్స్ ఏరియా, మయూర్ విశాల్ కాంప్లెక్స్, రోజరీ కాన్వెంట్ స్కూల్, ముసదిన్‌లాల్ షాప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం

అధ్వానంగా పబ్లిక్ టాయిలెట్స్

పలు ప్రాంతాల్లో బహిరంగ మూత్ర విసర్జన

ఇబ్బందులు పడుతున్న స్థానికులు


టూమ్స్ రోడ్డులోని మూతపడ్డ టాయిలెట్స్

గోల్కొండ: గత ప్రభుత్వ హయాంలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. పోటాపోటీగా బల్దియా వారి చొరవతో ఏర్పాటైన పబ్లిక్ టాయిలెట్స్ అంతే వేగంతో ఒకొక్కటిగా మూతపడ్డాయి. మెహిదీపట్నం, నానల్‌నగర్, టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులను ఆనుకొని నిర్మించిన ఈ పబ్లిక్ టాయిలెట్స్ అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లోని టాయిలెట్స్ తలుపులు, నీటి ట్యాంకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల వాటిలోని వస్తువులు మాయమయ్యాయి. పే అండ్ యూజ్ పబ్లిక్ టాయిలెట్స్ తరహాలో కాకుండా సెల్ఫ్ యూజ్ ప్రాతిపదికన ఏర్పాటైన ఈ పబ్లిక్ టాయిలెట్స్ ముందుగా నీటి సరఫరా లేక చాలా మట్టుకు మూతపడ్డాయి. మరికొన్ని రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహించే తోపుడు బండ్ల వ్యాపారుల కారణంగా మూతపడ్డాయి. తమ వ్యాపారానికి ఈ టాయిలెట్స్ అడ్డు వస్తున్నాయన్న కారణంతో తోపుడు బండ్ల వ్యాపారులు టాయిలెట్స్‌పైన ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు ధ్వంసం చేయడమే కాకుండా తలుపులను కూడా మూసేసి పలు చోట్ల తాళం వేశారు. మరికొన్ని చోట్ల పే అండ్ యూజ్ టాయిలెట్స్ నిర్వాహకులు ఈ ఉచిత టాయిలెట్స్ కావాలనే మూతపడేలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్ల పక్కనే మూత్ర విసర్జన..

పే అండ్ యూజ్ టాయిలెట్స్ రద్దీగా ఉండే బస్టాప్‌లు, కూడళ్ల వద్దనే ఉన్నాయి. మెహిదీపట్నంలో పే అండ్ యూజ్ టాయిలెట్స్ ఉండగా మరో పే అండ్ యూజ్ టాయిలెట్ టోలిచౌకీ చౌరస్తా వద్ద ఉంది. అక్కడ నుంచి మళ్లీ షేక్‌పేట్ నాలా వరకు ఒక్క పే అండ్ యూజ్ టాయిలెట్ లేదు. దీంతో బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు టాయిలెట్స్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక పలువురు రోడ్ల పక్కనే మూత్ర విసర్జన చేస్తూ తమ కడుపు ఉబ్బరాన్ని తగ్గించుకుంటున్నారు. ముఖ్యంగా రేతిబౌలి రింగ్ రోడ్డు, షేక్‌పేట్ నాలా బస్టాప్, టూమ్స్ చౌరస్తా, నానల్‌నగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో బహిరంగ మూత్ర విసర్జన కొనసాగుతుంది. మూత పడ్డ టాయిలెట్స్‌కు మరమ్మతులు చేసి వాటిని అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా పే అండ్ యూజ్ టాయిలెట్స్‌ను మరిన్ని ప్రధాన రోడ్ల పొడవున ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

'వక్ఫ్‌బోర్డు స్థలాన్ని నాకే అప్పగించాలి'

సుల్తాన్‌బజార్: వక్ఫ్‌బోర్డు కేటాయించిన స్థలాన్ని తనకు అప్పగించాలని ఓ బాధితుడు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హుమాయూన్‌నగర్‌కు చెందిన హబీబ్ అహ్మద్‌ఖాన్, అడ్వకేట్ ఖాజాతో కలిసి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా, యాదిరా మండలం, అప్పన్నపల్లి గ్రామంలో వక్ఫ్‌బోర్డు సర్వే నెంబర్ 242–243లో తనకు 10–09 ఎకరాల స్థలాన్ని ఒక సంవత్సరానికి గాను లీజుకు కేటాయించినట్లు తెలిపారు. జులై 2023లో వక్ఫ్‌బోర్డు వారు నిర్వహించిన బిడ్డింగ్‌లో అత్యధికంగా కోడ్ చేసిన బిడ్డర్గా వక్ఫ్‌బోర్డు వారు సాగు కోసం భూమిని కేటాయించారన్నారు. ఈ భూమిలో కోల్డ్ స్టోరేజ్, వర్టికల్ ఫార్మింగ్ ఏర్పాటు కోసం ప్రణాళికను సిద్ధం చేసుకున్నానని ఆయన పేర్కొన్నారు. దీంతో వక్ఫ్‌బోర్డు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఆ స్థలాన్ని ఆక్రమించిన భూకబ్జాదారులు అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వక్ఫ్‌బోర్డు స్పందించి తనకు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకొని తనకు అప్పగించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హైదరాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (40) బోరబండ–భరత్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు టీషర్టు, తెలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహ వేడుకకు హాజరైన అసదుద్దీన్ ఒవైసీ



గోల్కొండ: ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కుమారుడి వివాహం గురువారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కుమారుడు మహ్మద్ అఫ్సర్ మోహియుద్దీన్ వివాహ వేడుకలకు మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. పలువురు మజ్లిస్ కార్పొరేటర్లు, సీనియర్ మజ్లిస్ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువతి హల్‌చల్

అబిడ్స్: మద్యం మత్తులో రోడ్డుపై న్యూసెన్స్ సృష్టిస్తున్న ఓ యువతిని అబిడ్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. నాంపల్లి రైల్వేస్టేషన్ రోడ్డుపై ఓ యువతి మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఆ యువతిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఇన్‌స్పెక్టర్‌తో పాటు మహిళా కానిస్టేబుళ్లు నచ్చజెప్పి ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రోడ్డుపై న్యూసెన్స్ సృష్టించిన ఆమెపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకుండా ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

'ఇస్లాం మతం శాంతిని ప్రబోధిస్తుంది'


మాట్లాడుతున్న మతీన్ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: ఇస్లాం మతం శాంతిని ప్రబోధిస్తూ హింసను వ్యతిరేకిస్తుందని గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా హతీబ్ మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం గోల్కొండ దిలావర్‌షా నగర్‌లోని అక్తరీ మసీదులో ఇస్లాం, శాంతి అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇస్లాం మతం దాని సిద్ధాంతాలను వివరించారు. దైవ దూతలుగా ఈ ప్రపంచానికి వచ్చిన వారు శాంతిని ప్రబోధించారని ఆయన అన్నారు. శత్రువులను సైతం చిరునవ్వుతో పలకరించాలన్నదే ఇస్లాం ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ జీవితం మానవాళికి శాంతి సందేశం ఇచ్చారన్నారు. జీవితంలో విజయాలు సాధించాలంటే తల్లిదండ్రులను గౌరవించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి నడవడితో అందరితో కలిసిమెలిసి ఉంటూ దేశాభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన ఉద్బోధించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


రోడ్డుపై పారుతున్న మురుగు

జియాగూడ: కంచి కామాక్షి ఆలయం, వడ్ల బస్తీ, కంచెర బస్తీ, భుజంగరావు గల్లీలో డ్రైనేజీ సమస్యతో బస్తీలవాసులు తీవ్ర ఇబ్బందులు పొడుతున్నారు. వారంలో రెండు సార్లు డ్రైనేజీ నిండి మురుగునీరు రోడ్లపై పారుతుంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టకపోగా 40 ఏళ్ల క్రితం వేసిన ఆరు అంగుళాల పైప్‌లైన్ నేటికీ కొనసాగుతుందన్నారు. దీంతో డ్రైనేజీ నిండి రోడ్లపై మురుగునీరు పారుతుందని పలు బస్తీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండేళ్ల క్రితం రోడ్డు వేయడానికి రూ.18 లక్షల నిధులు సైతం మంజూరయ్యాయి. డ్రైనేజీ సమస్యలు ఇతర కారణాల వల్ల రోడ్డు నిర్మాణం పనులు కాలయాపన అవుతున్నాయని జాతీయ మానవ హక్కుల కార్వాన్ నియోజకవర్గం ఎంఎం రావు, రాష్ట్ర ఇన్‌చార్జ్ సర్వేందర్ తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, జియాగూడ వాటర్‌వర్క్స్ అండ్ సీవరేజీ విభాగం యుద్ధప్రాతిపదికన 12 ఇంచుల డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.

బాలుడిని చేరదీసిన ఆర్‌పీఎఫ్ పోలీసులు



నాంపల్లి: ఇంట్లో నుంచి పారిపోయి నగరానికి చేరుకున్న 17 ఏళ్ల ఓ బాలుడిని ఆర్‌పీఎఫ్ పోలీసులు చేరదీశారు. హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నెం–1లో ఒంటరిగా ఉన్న అతడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా గ్వాలియర్ నుంచి వచ్చినట్లు తెలిసింది. ఇంట్లో నుంచి కుటుంబసభ్యులతో గొడవపడి పారిపోయి వచ్చినట్లుగా తెలియడంతో అతడి రక్షణ కోసం చైల్డ్ లైన్ అధికారులకు అప్పగించినట్లు హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కల్పన పేర్కొన్నారు. రైళ్లలో, రైల్వే స్టేషన్లలో తప్పిపోయిన, పారిపోయి వచ్చిన పిల్లలను గుర్తించి ఆపరేషన్ నాన్హే ఫరిస్తే పథకం కింద ఆర్‌పీఎఫ్ నిరంతర ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. 2024లో హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీసులు 17 మంది పిల్లలను రక్షించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


యోగేష్ సింగ్ (ఫైల్)

అబిడ్స్: మంగళ్‌హాట్‌లో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. బలరాం గల్లీలో నివసించే యోగేష్ సింగ్ (25) ఇంటి నుంచి గురువారం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి మహావీర్ సింగ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత సంవత్సర కాలంగా పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యోగేష్ సింగ్ ఇంటి నుంచి వెళ్లాడని తండ్రి మహావీర్ సింగ్ పోలీసులకు తెలియజేశారు. మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ప్రేమ ముసుగులో ఇంట్లో దూరిన యువకుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ప్రేమ ముసుగులో ఇంట్లో దూరిన ఓ యువకుడిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గౌస్‌నగర్‌కు చెందిన సొహేల్(25) ఆరు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో ట్రాప్ చేశాడు. ఈ ఘటనపై సొహేల్‌పై పోక్సో చట్టం కింద నమోదు చేసి జైలుకు పంపారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన సొహేల్ సదరు బాలికతో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో బాలిక సోదరుడికి ఫోన్ చేసి అక్కతో ఫోన్ మాట్లాడించాలని బెదిరించాడు. చివరకు బాలికతో ఒకట్రెండు పర్యాయాలు మాట్లాడాడు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున ఫజర్ నమాజ్‌కు ఇంట్లోని మగ వారు బయటికి వెళ్లిన సమయంలో బాలికను కలుసుకోవాలని భావించి, అర్ధరాత్రి వేళ గేట్‌దూకి మెట్లకింద నక్కాడు. 5 గంటలకు బాలిక తండ్రి బయటికి వెళుతున్న సమయంలో బాలిక రూంలోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. అలికిడిని గమనించిన తండ్రి అప్రమత్తం కావడంతో బయపడిన సొహేల్ ఓపెన్‌గా ఉన్న కిటికిలో నుంచి గదిలో దూకి గొళ్లెం పెట్టుకున్నాడు. తనను చంపేందుకు యతిస్తున్నారంటూ వీడియో తీసి స్నేహితులు, డయల్–100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యువకుడిని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా తనకు కుమారుడు జన్మించాడని, చూసేందుకు రావాలంటూ బాలిక పిలిస్తేనే సొహేల్ వెళ్లాడని, ఇదంతా పథకం ప్రకారమే చేశారంటూ అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

నేడు, రేపు ఎడ్యుకేషన్ సమ్మిట్-2024

విజయనగర్‌కాలనీ: క్రియేటీవ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2024 ఎగ్జిబిషన్‌ను ఈనెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఆర్.కమల్‌రాయ్ తెలిపారు. మాసబ్‌ట్యాంక్ జయవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో శుక్రవారం ఆయన వివరాలను వెల్లడించారు. గేమింగ్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్, ఫిల్మ్, ఫ్యాషన్ డిజైనింగ్ ఇంటీరియర్ డిజైన్, అప్లెడ్ ఆర్ట్స్ తదితర విభాగాల్లో ఉన్న చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సెమినార్‌లు, కౌన్సెలింగ్, కాన్ఫరెన్స్, వర్క్‌షాపుల్లో తెలయజేయడం జరుగుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వివిధ రంగాల నిపుణుల గైడెన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 85003 55221, 74164 63205లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి


వేడుకల్లో పాల్గొన్న మనోహర్ గైక్వాడ్ తదితరులు

అబిడ్స్: మంగళ్‌హాట్ ఇంద్రానగర్ మహర్ ఎస్సీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ గైక్వాడ్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ..బుద్ధుడి ఆశయాలు మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

భీమ్‌సేన్ జైస్వాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


పేదలకు దస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: ప్రముఖ సంఘ సేవకుడు భీమ్‌సేన్ జైస్వాల్ 3వ వర్ధంతిని పురస్కరించుకుని కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో బతికి ఉన్నప్పుడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భీమ్‌సేన్ జైస్వాల్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత నడవాలని ఆయన సూచించారు. అమర్‌సింగ్, సుధీర్, అనిల్‌యాదవ్, కాజల్, రామకృష్ణ, రేణుక, రఘు, సందీప్, రాజీవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ ప్రాంగణంలో సేదతీరిన పర్యాటకులు



చార్మినార్: మళ్లీ రెండు రోజుల నుంచి ఎండలు మండిపోయాయి. దీంతో శుక్రవారం పాత బస్తీని సందర్శించడానికి వచ్చిన సందర్శకులు చార్మినార్–మక్కా మసీదు ప్రాంగణంలోని నీడకు కొద్దిసేపు సేద తీరారు. సందర్శన టికెట్ల కోసం ఎండలోనే నిల్చున్నారు. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోనే కౌంటర్ వద్ద క్యూ కట్టారు. ఎండల కారణంగా చార్మినార్ వద్ద మధ్యాహ్నం పూట కొద్దిసేపు తమ గిరాకీ తగ్గిందని చిరు వ్యాపారులు చెప్పారు.

రక్తదానం చేయండి

చార్మినార్: తలసేమియా చిన్నారులకు రక్తం దానం చేయడానికి స్వచ్ఛద సంస్థలు, కార్పొరేట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ముందుకు రావాలని తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ కార్య నిర్వాహక కార్యదర్శి అలీం బేగ్ పిలుపునిచ్చారు. ఆశించిన స్థాయిలో రక్త నిల్వలు లేని కారణంగా వేసవి కాలంలో తలసేమియా చిన్నారులకు రక్తం ఎక్కించడానికి అప్పుడప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారని.. ఇంకా అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న 'నాగమండలం'


నాటకంలోని ఓ దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో నాగమండలం అనే నాటకాన్ని ప్రదర్శించారు. భార్యపై భర్త ఆధిపత్యాన్ని తెలుపుతూ ప్రదర్శించిన నాటకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రొఫెసర్ భార్గవిరావు ఈ నాటకాన్ని తెలుగులోకి అనువాదించగా డాక్టర్ రామ్ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రసరంజని కార్యవర్గ సభ్యులు, నాటక ప్రియులు పాల్గొన్నారు.

బుల్లెట్ బండి పేలిన ఘటనలో మరో వ్యక్తి మృతి


మహ్మద్ హుస్సేన్ ఖురేషి (ఫైల్)

గౌలిపురా: బుల్లెట్ బండి పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో చికిత్స పొందుతున్న మూడో వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 12న జరిగిన ఈ ప్రమాదకర ఘటనలో దాదాపు 10 మంది గాయపడ్డారు. ఇందులో ఇద్దరు 80 శాతానికి పైగా కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న మహ్మద్ నదీం ఈనెల 13న మృతి చెందగా..ఈనెల 14న షౌకత్ అలీ మృతి చెందగా.. శుక్రవారం మహ్మద్ హుస్సేన్ ఖురేషి మృతి చెందాడు.

మురుగు..పరుగు


కార్వాన్ మార్కెట్ రోడ్డు దుస్థితి

గోల్కొండ: కార్వాన్ మార్కెట్ రోడ్డు మురుగు కాలువను తలపించే విధంగా మారింది. వేసవిలో సైతం కార్వాన్ మెయిన్ రోడ్డు వర్షాకాలం రోడ్లను తలపిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై ప్రతినిత్యం మురుగు నీరు ప్రవహిస్తుంది. పాదచారులు రోడ్డుపై నడవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొని ఉంది. గుంతలమయమైన రోడ్డుపై మురుగు నీరు ఉండడం, వాహనాల రాకపోకలతో ఈ నీరు పాదచారులపై చిమ్ముతుండడంతో పాదచారులు అతి జాగ్రత్తగా ముందడుగు వేస్తున్నారు. గుంతలమయమైన రోడ్ల కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానిక వ్యాపారులు అంటున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధిగానీ, అధికారులు గానీ ఈ రోడ్డు వైపు కనెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.